జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 12-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 535 పేజీలు: 4 వెల : రూ.7





## ఫోకస్

* విద్యార్థులు వసతి గృహంలో లేకున్నా.. మొబైల్లో హాజరు! * వారి ఇంటింటికి వెళ్లి ఫేస్ రికగ్నిషన్ సర్వీస్ చేస్తున్న హాస్టల్ సిబ్బంది * ఎఫ్‌ఆర్ఎస్ స్కామ్ వెనుక జిల్లా అధికారి హస్తం * భోజన బిల్లులు స్వాహా * జిల్లా అధికారికి నెలకు రూ.30వేలు మామూలు ఆరోపణలు * సముద్ర తీర ప్రాంతాల్లోని హాస్టళ్లలో ఇది దుస్థితి

### ఫేస్ రికగ్నిషన్‌తో..
# ఫేక్ హాజరు!

**శ్రీకాకుళం, డిసెంబర్ 11 (వార్త):** ప్రభుత్వ బిసి సంక్షేమ వసతి గృహాలలో (హాస్టళ్లలో) పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నిషన్ సర్వీస్ (ఎఫ్‌ఆర్‌ఎస్) అవినీతి అధికారులకు కాసుల వర్షం కురిపించే కొత్త మార్గంగా మారింది. వెనుకబడిన తరగతులు (బీసీ), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) సంక్షేమ శాఖల వసతి గృహాల్లో విద్యార్థులు లేకున్నా, వారి ఇంటికి వెళ్లి హాజరు వేయిస్తూ... కోట్ల రూపాయల ప్రజాధనాన్ని అక్రమంగా డ్రా చేస్తున్న వైనం 'జాతీయ వార్త' పరిశోధనలో వెల్లడైంది. నిబంధనలను ఉల్లంఘిస్తూ, సముద్ర తీర ప్రాంతంలోని దాదాపు 16 వసతి గృహాలలో ఈ 'ఇంటింటికి ఎఫ్‌ఆర్‌ఎస్' స్కామ్ యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆధారాలు లభించాయి. వసతి గృహంలో ఉండని విద్యార్థుల పేరుతో ప్రభుత్వ నిధులను దోచుకోవడానికి కొందరు అధికారులు, వార్డెన్లు ఒక వినూత్న పద్ధతిని అమలు చేస్తున్నారు. ముఖ హాజరు వేసుకునేందుకు సహకరిస్తున్న తల్లిదండ్రులకు రూ.10, అసిస్టెంట్ బ్యాక్‌వర్డ్ క్లాస్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏ.బి.సి.డ.బ్ల్యు.ఓ)కి రూ.15, వార్డెన్/ఇతరుల వాటా రూ.20 మొత్తంగా రూ.45లు చెల్లిస్తోంది. ముఖ ఆధారిత హాజరు వేయించినందుకు వచ్చే రూ.45లో అధిక భాగం విద్యార్థి సంక్షేమానికి కాకుండా, అధికారుల జేబుల్లోకి పోతోంది. హాస్టల్‌లో ఉండని విద్యార్థికి రూ.10 ఇచ్చి, మిగిలిన నిధులను పంచుకోవడం ఈ స్కామ్ ప్రధాన లక్ష్యం.

### స్థానిక విద్యార్థుల పేర్లతో నిబంధనల ఉల్లంఘన..

వసతి గృహాలకు దగ్గరలో ఉన్న 5 కిలోమీటర్లు దాటిన వారికి హాస్టల్లో సీట్లు ఇవ్వాలి. స్థానిక విద్యార్థులు (లోకల్ బోర్డర్స్) లింకు సీట్లు ఇవ్వడానికి నిబంధనలు అంగీకరించవు. అయినప్పటికీ, వీటిని అతిక్రమించి ఇష్టం వచ్చినట్లు సీట్లు కేటాయిస్తున్నారు. హాజరు పట్టికలో 70 నుంచి 100 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లు చూపిస్తున్నారు. కానీ, వాస్తవంగా అక్కడ ఎవరూ ఉండటం లేదు. హాస్టల్‌లో లేని పిల్లలకు కేవలం దుప్పట్లు, బెడ్ షీట్లు, కాస్మటిక్ చార్జీలు వంటివి ఇచ్చి, రోజువారీ భోజనం, వసతి కోసం ప్రభుత్వం కేటాయించిన డబ్బులన్నీ డ్రా చేసి స్వాహా చేస్తున్నారు.

### తీర ప్రాంత వసతి గృహాల్లోనే అవినీతి

సముద్ర తీర ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ వసతి గృహాలలో భోజన, వసతి సౌకర్యాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. వసతి గృహంలో విద్యార్థులు ఉంటే, కనీసం ఉదయం స్నానాలు చేసిన బట్టలైనా ఆరబెట్టాలి. భోజనాలు పెడితే ప్లేట్లు ఉండాలి, గుడ్లు, అరటిపళ్ళ తొక్కలైనా కనిపించాలి. ఇవేమీ ఇక్కడ కనిపించవు. సిబ్బంది, వార్డెన్లు ముందస్తు సమాచారం తెలుసుకొని, ఎవరైనా అధికారులు తనిఖీకి వస్తారంటే, విద్యార్థులను తాత్కాలికంగా హాజరు పరిచి, వారు వెళ్లిపోయాక ఇళ్లకు పంపించే వ్యవహారం నిరంతరం జరుగుతోంది.

### జిల్లా అధికారికి.. ప్రతినెలా రూ.30 వేలు..

ఈ అక్రమాలకు జిల్లా స్థాయి అధికారి సహకారం పుష్కలంగా ఉందన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలోని దాదాపు 16 వసతి గృహాల వరకూ ఉన్నాయి. ప్రతి వసతి గృహం నుంచి నెలకు రూ.30వేలు జిల్లా అధికారికి వసూలు అందుతోందట. అందుకే పర్యవేక్షణ పూర్తిగా గాలికి వదిలేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం డబ్బు కోసమే ఈ అక్రమాలను ఆ అధికారి కళ్ళు మూసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ముఖ ఆధారిత హాజరు వ్యవస్థలో జరుగుతున్న ఈ లొసుగులను సరిదిద్ది జిల్లా అధికారిపై, అవినీతి వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకుని, విద్యార్థుల సంక్షేమం కోసం ఉద్దేశించిన నిధులు సక్రమంగా వినియోగపడేలా చూడాలని మత్స్యకార సంఘాలకు చెందిన కొందరు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాలన్నీ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), విజిలెన్స్, నిఘా విభాగాల అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు కొందరు సంసిద్ధులవుతున్నారు.

### రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ పోస్టుల నియామకం..
# ఉన్నట్టా? లేనట్టా?




* స్పష్టత ఇవ్వని అధికారులు
* మీమాంసలో దరఖాస్తు చేసిన నిరుద్యోగులు
* కలెక్టర్ వద్ద మెరిట్ జాబితా
* మెరిట్ కాకుండా తమ వారికే పోస్టులు ఇవ్వాలంటున్న ప్రజాప్రతినిధులు
* తలలు పట్టుకుంటున్న ఉన్నతాధికారులు
* సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లనున్న దరఖాస్తుదారులు

**శ్రీకాకుళం, డిసెంబర్ 11 (వార్త):** జిల్లా నిరుద్యోగ యువతకు ఆశలు రేకెత్తించిన శ్రీకాకుళం రాజీవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లోని 41 ఔట్‌సోర్సింగ్ పోస్టుల నియామక ప్రక్రియ జరుగుతుందా లేదా అన్న అనుమానం అందరిలోనూ ఉంది. మెడికల్ కళాశాల అధికారులైతే మెరిట్ జాబితాను జిల్లా ఉన్నతాధికారికి పంపించినట్టు తెలుస్తోంది. అయితే కొందరు ప్రజాప్రతినిధులు తమ వారికే ఈ పోస్టులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఆయన ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. మెరిట్‌లో ఉన్న వారు తమకు ఉద్యోగం వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. దీనిపైకొందరు యువత ఇటీవల గ్రీవెన్స్‌లో కూడా అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్టు తెలుస్తోంది. రిమ్స్ నోటిఫికేషన్‌కు స్పందించి, సుమారు 2 వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 'జాతీయ వార్త'లో ప్రచురితమైన కథనంతో సంబంధిత అధికారుల్లో చలనం వచ్చినప్పటికీ బయటకు మాత్రం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ నియామక ప్రక్రియపై ఏ ఒక్క అధికారి కూడా స్పష్టత ఇవ్వకపోవడం పట్ల దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అన్ని జిల్లాల్లోనూ ఔట్‌సోర్సింగ్ పోస్టుల నియామకం ప్రక్రియ పూర్తయినప్పటికీ శ్రీకాకుళం జిల్లాలో మాత్రం పెండింగ్‌లో ఉంచారు. దీనిపై కొందరు ముఖ్యమంత్రికి, డిప్యూటీ సీఎంకు, రాష్ట్రవిద్యాశాఖ, వైద్యశాఖ మంత్రికి ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

## వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు భూమి పూజ

**శ్రీకాకుళం, డిసెంబర్ 11(వార్త):** మాజీ ప్రధానమంత్రి, భారత రత్న, అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళంలో ఈనెల 19న నిర్వహించనున్న అటల్ - మోదీ సుపరిపాలన యాత్ర విజయవంతం చేయాలని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. గురువారం శ్రీకాకుళం నగరంలోని సూర్యమహల్ జంక్షన్ వద్ద అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణకు భూమిపూజను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి , పూర్వ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతు పాపారావు, బీజేపీ నాయకులు రెడ్డి నారాయణరావు, రాష్ట్ర ఓబీసీ మోర్చా కో కన్వీనర్ సురేష్ బాబు సింగ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఐటీ సెల్ కన్వీనర్ సింగుపురపు వెంకటరమణ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పైడి సింధూర, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సూర్యకుమారి, జిల్లా పదాధికారులు బైపల్లి రాజేశ్వరి, బడే తాతారావు, బీజేవైఎం ఉపాధ్యక్షులు దన్నాన మదన్, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మాడుగుల శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు చింతాడ భూషణరావు, టేకి మాధవ్, గొల్లంగి అసిరినాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# పెంట కుప్పల్లో మొంథా తుఫాన్ సరుకులు

* సకాలంలో మత్స్యకారులకు పంపిణీ కానీ బంగాళదుంపలు, ఉల్లిపాయలు
* కుళ్లిపోవడంతో చెత్తకుప్పల్లో పడేసిన డీలర్లు * సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లేనన్న మత్స్యకారులు

**సంతబొమ్మాళి, డిసెంబర్ 11 (వార్త):** సంతబొమ్మాళి మండలంలో మొంథా తుఫాన్ సరుకులు నేలపాలయ్యాయి. తుఫాన్ వచ్చి దాదాపు 40రోజులు అవుతున్నా.. నేటికీ మత్స్యకారులకు పంపిణీ కాకపోవడంతో అవి డీలర్ల వద్దే మొలకలు వచ్చి కుళ్లిపోయాయి. చేసేది లేక కొందరు డీలర్లు వాటిని పారబోశారు. మొంథా తుఫాన్ అక్టోబర్ 30న వచ్చింది. ఆ సమయంలో మత్స్యకారులు చేపల వేటకు దూరమయ్యారు. ఈ సమయంలో ప్రభుత్వం మత్స్యకారుల జీవన భృతి కోసం నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా సంతబొమ్మాళి మండలంలో భావనపాడు, కె.లింగుడు, మేఘవరం, మరువాడ, లక్కివలస, మలగాం, జగన్నాధపురం, ఉమిలాడ తదితర మత్స్యకార గ్రామాల్లోని మత్స్యకారుల కోసం బియ్యంతో పాటు 1806 కిలోల బంగాళా దుంపలు, 1806 కిలోల ఉల్లిపాయలు మొదటి విడతలో పంపిణీకి సిద్ధం చేశారు. అయితే ఆ సరుకులు మత్స్యకారులందరికి సరిపడవని, కొందరికిచ్చి ఇంకొందరికి ఇవ్వకపోతే గ్రామాల్లో తగాదా ఏర్పడుతుందని భావించిన డీలర్లు ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వాటిని పంపిణీ చేయకుండా నిలిపివేశారు. బియ్యం బాగానే ఉంది కాని, బంగాళదుంపలు, ఉల్లిపాయలు కుళ్లిపోయాయి. ఈవిషయమై డీలర్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. ఈ విషయం ఇటీవల జరిగిన మండల సమావేశం పలువురు సభ్యులు లేవనెత్తినప్పటికీ పంపిణీలో మాత్రం జాప్యమైంది. డీలర్ల వద్ద ఉన్న బంగాళదుంపలు, ఉల్లిపాయలు పాడైపోవడంతో వాటిని పారబోశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని మత్స్యకారులు వాపోయారు. దీనికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘ ప్రతినిధులు కోరుతున్నారు.



# మహిళలు, బాలికల భద్రతపై అవగాహన



**పలాస, డిసెంబరు11(వార్త):** మహిళలు, బాలికల భద్రతపై పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం శక్తి టీం అవగాహన కల్పించారు. ఆపద సమయంలో ఎలా తమను తాము రక్షించుకోవాలి, చట్టాలు, డ్రగ్స్‌పై అప్రమత్తత, రహదారి భద్రత తదితరాలను వివరించారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలను, శక్తి యాప్, ఎమర్జెన్సీ నంబర్లు, ఆత్మరక్షణ శిక్షణను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆత్మరక్షణ పద్ధతులు, మహిళల సమస్యలు, చట్టాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పెన్, కీలు, బ్యాగ్ వంటి వస్తువులను ఆయుధాలుగా ఉపయోగించుకోవాలని, దూరం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, శక్తి టీం ఇన్‌చార్జి, ఏఎస్ఐ ఎస్.బైరాగి, కానిస్టేబుల్స్ బి.ధనలక్ష్మి, కె.వాసుదేవరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మధుర చరిత్రకారుడు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవ రావు, తమ్మినాన పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మామిడి జన్మదిన వేడుకలు



**మెళియాపుట్టి, డిసెంబరు 11(వార్త):** తూర్పు కాపు రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకులు మామిడి శ్రీకాంత్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. మెళియాపుట్టిలో సర్పంచ్ డాక్టర్ గణపతి ప్రధాన్ ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాడి అప్పారావు, బోసి రామారావు, పెద్దింటి చంద్రరావు, గణేష్ ప్రధాన్, ఉర్లాన ఋషి, రవ్వల దుర్యోధన, నక్క వెంకట్రావు, జడ్డేటి కృష్ణ, జి.చిన్నారావు, రాజాన వెంకటరావు, శ్రీరామ్ శ్రీను, దుబ్బ రాజు, సలాన సత్యం, ఉర్లాన నీలకంఠం, గేదెల ఢిల్లీరావు, బి. లక్ష్మీనారాయణ, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శారదా మాత జయంతి



**సోంపేట, డిసెంబరు 11(వార్త):** రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోంపేటలో గురువారం జగన్మాత శారదా మాత జయంతి ఘనంగా నిర్వహించారు. సేవా సమితి సభ్యులు, మహిళలు, యువత, రాజకీయ ప్రతినిధులు, ఉద్యోగులు హాజరై ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అష్టోత్తర శతనామావళి, లలిత సహస్ర నామ పారాయణం, మహిళల భక్తి గీతాలు, ప్రముఖుల ఆధ్యాత్మిక సందేశాలతో రామ కృష్ణ ప్రాంగణం ఎంతో వేడుకగా మారింది. శారదాదేవి త్యాగాన్ని, తన భర్త రామకృష్ణ పరమహంసకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గరుడాచలం శంకరరావు, రెల్ల నారాయణ, రామకృష్ణ, డాక్టర్ లక్ష్మీనారాయణ, మేనకేతన్ రావు, చంద్రశేఖర్, మలిపెద్ది వేణు, జోగారావు, కొంచాడ వేణు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్‌కి సన్మానం



**ఇచ్ఛాపురం, డిసెంబరు 11(వార్త):** రెడ్డిక వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొండ శంకర్‌రెడ్డిని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రెడ్డిక కార్పొరేషన్‌కి సంబంధించిన అంశాలను చర్చించారు. కార్యక్రమంలో నరసింహ రెడ్డి, గౌతమ్ రెడ్డి, మండల అధ్యక్షురాలు దుర్గాసి నీలావేణి రెడ్డి, కాకినాడ సంతోష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

**-ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు**

**-బీసీ సంక్షేమ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ**



**పలాస, డిసెంబరు 11(వార్త):** విద్యార్థినిలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు ఉపాధ్యాయులకు సూచించారు. పలాస శివాజీనగర్ ప్రాంతంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ బాలికల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలంటే పాఠశాల, కుటుంబం, సమాజం కలిసిన సమగ్ర ప్రణాళిక అవసరమన్నారు. విలువల విద్య, జీవన నైపుణ్యాలు, పౌర శిక్షణ ఈ మూడు స్తంభాలపై మీరు దృష్టి పెడితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి, సదుపాయాలు ఎలా ఉన్నాయో తెలుసుకున్నారు. వంటగది, హాస్టల్ పరిసరాలు పరిశీలించారు.

## పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**సారవకోట, డిసెంబరు 11(వార్త):** పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలని ఎంఈఓ మడ్డు వెంకటరమణ సూచించారు. చిన్న కిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్‌ను కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా



చదువుకు అనువైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలకు ముందు విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలో ప్రత్యేక శిక్షణ తరగతులు, మార్గదర్శక కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. స్థానికుల అభిప్రాయాలు, ఉపాధ్యాయుల సూచనల్ని పరిశీలించిన అనంతరం పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలపై ఎంఈఓ హామీ ఇచ్చారు.

# సమస్య ఇలా విన్నారు...అలా నెరవేర్చారు..!

**-డిమిరియా బ్రిడ్జికి రూ.3కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే**

**-శిరీషకు సర్వదా రుణపడి ఉంటాం**

**-కృతజ్ఞతలు తెలిపిన కూటమి నాయకులు**



**మందస, డిసెంబరు 11(వార్త):** సమస్యను తక్షణమే పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష పరిష్కరిస్తారని కూటమి నాయకులు కొనియాడారు. జిల్లుండ పంచాయతీ డిమిరియా గ్రామంలో గల వారు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు 30 ఏళ్ల కిత్రం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని, కుప్పకూలిపోయే పరిస్థితికి చేరుకుందన్నారు. ఈ సమస్యను శిరీష దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే స్పందించి రూ.3కోట్లను బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేయించారన్నారు. బ్రిడ్జితో పాటు మందస నుంచి డిమిరియా గ్రామం వరకు 1.60కిలోమీటర్ల రోడ్డు కూడా నిర్మిస్తున్నారన్నారు. తమ గ్రామ సమస్యను సొంత సమస్యగా భావించి, పరిష్కరించినందుకు ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ పలాస నియోజకవర్గం సమన్వయకర్త వెంకన్నచౌదరి, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీతో పాటు అభివృద్ధికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీర సౌదామిని, జనసేన మందస మండల పార్టీ అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పల్లి చంద్రయ్య, టీడీపీ క్లస్టర్ కన్వీనర్ ముంజేటి చంద్రశేఖర్, సీర ఈశ్వరరావు, పల్లి మోహనరావు, సీర జగ్గారావు, బెస్త వెంకటరావు, సీర రామారావు, కుప్పాయి కూర్మారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## పోలాకి-నౌపడ రహదారిపై హెచ్చరిక బోర్డులేవీ..?

**-ప్రమాదాలపై ప్రజల్లో ఆందోళన**



**పోలాకి, డిసెంబర్ 11 (వార్త):** పోలాకి నుంచి డోల-నౌపడ మార్గంలో పలుచోట్ల ఉన్న తీవ్రమైన మలుపులు వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రహదారి నిర్మాణం పూర్తయినప్పటికీ ఈ మలుపుల్లో ఎక్కడా హెచ్చరిక బోర్డులు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ముఖ్యంగా తలసముద్రం వద్ద ఉన్న అడ్డు రోడ్డు జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. తీవ్రమైన ఢీకొనుళ్ల వల్ల పలువురు వాహన చోదకులు తీవ్ర గాయాలు పొందుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. వరస ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రహదారి మలుపుల వద్ద వెంటనే హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, ప్రతిబింబించే గుర్తులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో భాగంగా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఉద్యమ నేత సీతారాం మృతి తీరని లోటు

**-'నర్తు' కుటుంబాన్ని పరామర్శించిన నేతలు**

**మందస, డిసెంబరు 11(వార్త):** లోహరిబంద పంచాయతీ గొల్లల పాలెం గ్రామానికి చెందిన ప్రజా ఉద్యమ నాయకుడు, ఉత్తరాంధ్ర జనశక్తి పార్టీ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం సభ్యుడైన కామ్రేడ్ నర్తు సీతారాం మృతి తీరని లోటని పలువురు వక్తలు అన్నారు.




గురువారం సీతారాం ఇంటికి వెళ్లిన నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 ఏళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందడం బాధాకరమన్నారు. డా.వై.యస్.ఆర్.ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మాజీ మెంబర్ బత్తిని లక్ష్మణ్ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తామడ సన్యాసిరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే ప్రజా ఉద్యమాలకి ఆకర్షితులై జనశక్తి పార్టీలో చేరి రైతు ఉద్యమాలని ఉధృతం చేసే దిశగా అడుగులు వేశారన్నారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు పోరాటాలు చేశారని కొనియాడారు. తండ్రి ఆశయాన్ని కొనసాగించాలని ఆయన కుమారులను కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ సభ్యుడు మద్దిల రామారావు, బాలిగాం పి.ఏ.సి.ఎస్ మాజీ చైర్మన్ సోర్ర ఢిల్లీశ్వరావు, జనశక్తి సభ్యుడు కోనేరు రమేష్, అమరుల బంధు మిత్రుల సంఘ సభ్యుడు గుంటు రామస్వామి, పలాస నియోజకవర్గ వైఎస్సార్సీపీ యువజన అధ్యక్షుడు దున్న హరికృష్ణ, పులారి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## సైనిక్ నగర్ శ్మశానవాటికకు మోక్షం

**-సమస్యను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లిన బీజేపీ నాయకులు**

**-తక్షణమే స్పందించిన అధికారులు**



**టెక్కలి, డిసెంబరు 11(వార్త):** తొలిసూరుపల్లి పంచాయతీకి చెందిన సైనిక్ నగర్ సమీపంలోని శ్మశానవాటిక సమస్యను ఇటీవల బిజెపి నాయకులు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు గురువారం మండల సర్వేయర్ బాల రెడ్డి, స్థానిక సర్వే గోవిందు కలిసి ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు, కోటబొమ్మాళి మార్కెటింగ్ డైరెక్టర్ జర్జాన రాంజీ అధికారులతో మాట్లాడుతూ ముళ్ల పొదలను తొలగించాలని, స్థలం



మొత్తం సర్వే చేపట్టి, శ్మశానస్థలానికి కంచెతో రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై వారు స్పందించి తొలుసూరిపల్లి పంచాయతీ సెక్రెటరీ హరి సిబ్బందికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వెంటనే జేసీబీ సహాయంతో ముళ్ల పొదలను తొలగింపు చర్యలు చేపట్టారు. శ్మశానవాటిక స్థలం 0.50 సెంట్లుగా రికార్డులో ఉందని తెలిపారు. ఆ స్థలానికి సరిహద్దులు వేసి పంచాయతీకి అప్పజెప్పుతామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించిన అధికారులకు బిజెపి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు బూరీ నరేంద్ర, దూపాన రాజకుమార్, జనరల్ సెక్రెటరీ శాసన పూరి శ్రీను, ఉపాధ్యక్షులు ఆకులు ప్రకాష్, ఒడిసి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాలు క్రమశిక్షణతో నడపాలి



**సోంపేట, డిసెంబరు 11(వార్త):** డ్వాక్రా సంఘాలను ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా క్రమశిక్షణతో బాధ్యతగా నడపాలని సోంపేట ఏపీఎం సనపల ప్రసాదరావు కోరారు. పట్టణంలో 11వ గ్రామ సంఘం సమావేశానికి గురువారం ఆయన హాజరై సభ్యులకు పలు సూచనలు చేశారు. పుస్తకాలు నిర్వహణ, రుణాలు సక్రమంగా తిరిగి చెల్లించడం, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు, జీవనోపాధి మెరుగుదల మొదలైన వాటిపై సరైన నిర్ణయాలు తీసుకొని సక్రమంగా సంఘాన్ని నిర్వహించా లని కోరారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ కె.రాము, వీవో ఎ.భవాని, సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌ని కలిసిన ధర్మారావు



**ఎచ్చెర్ల, డిసెంబరు 11(వార్త):** ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్కోజు ధర్మారావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఓబీసీ మోర్చా జోనల్ ఇంచార్జ్ రౌతు చిరంజీవి రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి సురేష్‌బాబు సింగ్, వజ్రపుకొత్తూరు మండలం పూర్వపు మండల అధ్యక్షులు మరడ మనోజ్‌కుమార్, బోండా శ్రీనివాసరావు ఉన్నారు.

## ఇంటర్‌లో ప్రవేశాలకు స్పెషల్ క్యాంపెయిన్




**ఇచ్ఛాపురం, డిసెంబరు 11(వార్త):** క్రమశిక్షణ, నాణ్యమైన విద్య విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాట వేస్తుందని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు కొత్తశాసనం ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, మధ్యాహ్నం భోజనంతో పాటు నీట్, ఐఐటీ మొదలగు పరీక్షలకు కూడా ఉచిత మెటీరియల్ అందిస్తున్నదని, క్రమశిక్షణ, అనుభవం ఉన్న అధ్యాపకులతో బోధన జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పైడి గోపాలరావు, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.వి.కామేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు బోరుభద్ర సురేష్‌కుమార్, పైడి సురేష్‌కుమార్, నూకల రాజశేఖర్, హెణ్నీ ప్రధాన్, చింతాడ పాపారావు, కె.మనోజ్, జ్యోతి పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన గిరిబాబు



**పలాస, డిసెంబరు 11(వార్త):** ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు గురువారం పరామర్శించారు. స్వర్గస్తులైన పలాస కాశీబుగ్గ మున్సి పాలిటీ పలాస పెద్దవీధి వైయస్సార్ పార్టీ ఇంచార్జ్ లోకనాథ్ బెహరా తండ్రి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి వడిశా హరిప్రసాద్, వైసీపీ నాయకులు వల్లభ వైకుంఠరావు, డి.నాగభూషణం, ఆ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర పాఠశాలల ఆటల పోటీలు ప్రారంభం

**పలాస, డిసెంబరు 11(వార్త):** పలాస నియోజవర్గ స్థాయి అంతర బాల, బాలికల ఆటల పోటీలు గురువారం వజ్రపుకొత్తూరు మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాలికలకు కబడ్డీ, వాలీబాల్, కోకో, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, బాలురకు అథ్లెటిక్స్ సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.హేమరావు, ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఎస్ఎంసీ చైర్మన్ బి.లక్ష్మీపతి, సర్పంచ్ డి.పద్మావతి, ఎంపీటీసీ డి.మోహనరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ డి.హేమంబాబు చౌదరి, ఎంఈఓ బి.వెంకటరమణ గ్రామ పెద్దలు జయరాం చౌదరి, చక్రవర్తి, ఉపేంద్ర రావు, నీలరావు, అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, కే. హరిబాబు, పి.గజేంద్ర, జే.నారాయణ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మృతుల కుటుంబాలకు ఎంపీపీ పరామర్శ

**సోంపేట, డిసెంబరు 11(వార్త):** కంచిలి మండలంలో వైసీపీ అభిమానుల కుటుంబాల్లో ఇటీవల పలువురు మృతి చెందడంతో ఆ కుటుంబాలకు ఎంపీపీ పైల దేవ దాసు రెడ్డి పలువురు వైసీపీ నేతలు కలిసి గురువారం పరామర్శలు చేశారు. బొగబెని గ్రామంలో పంచాయతీ వైసిపి అధ్యక్షుడు గుమ్మడి రామయ్య తల్లి మహాలక్ష్మమ్మ ఇటీవల మృతి చెందింది. అలాగే గోకర్ణ పురం సర్పంచ్ యారాడి ఆనందరావు మేనల్లుడు సీర సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయా కుటుంబాలను పరామర్శించి చిత్రపటాల వద్ద నివాళు లర్పించారు. ఆయా కుటుంబాలకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని మృతుల ఆత్మలకు శాంతిని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు దుర్గాసి ధర్మారావు, కొనపల సురేష్, తలగాన తిరుపతి, మద్దు వెంకటరావు, పలికల జయరాం, మద్దు అభి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# పెంట..పెంట చేస్తున్నారు..!

**-తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించలేరా?**

**-ప్రజలకు అవగాహన కల్పించడంలో సిబ్బంది వైఫల్యంపై అధికారుల ఆగ్రహం**

**-పెంట గ్రామాన్ని సందర్శించిన డీపీఆర్సీ అధికారులు**

**- పారిశుధ్యంపై అసంతృప్తి**



**జి.సిగడాం, డిసెంబరు 11(వార్త):** ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని జిల్లా డిపిఆర్సి రీసెర్చ్ అధికారులు కె.రాజేష్, మోహిదిన్ ఖాన్ అసహనం వ్యక్తం చేశారు. రోజువారీ చెత్త సేకరించడంలో విఫలం చెంది, చెత్త సేకరణ ఐవీఆర్ఎస్ కాల్స్ ఫిర్యా దులో జిల్లాలో పెంట గ్రామం ముందంజలో ఉందని జిల్లా ఉన్నకారుల దృష్టికి రావడంతో కలెక్టర్ స్వప్నిల్దినకర్ పుండ్కర్, డీపీవో సౌజన్యభారతి ఆదేశాల మేరకు జి.సిగడాం మండలం పెంట గ్రామాన్ని, చెత్త నుంచి సంపద కేంద్రాన్ని గురువారం వారు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఈ సమయంలో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా కాకుండా కలిపి తీసుకు రావ డంతో అధికారులు చేస్తున్నదే ఒప్పుగా భావిస్తున్నారంటూ ఎంపీడీవో జి.రామ కృష్ణారావుకు పలు సూచనలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శిని మంద లించారు. పలు మార్లు హెచ్చరించినా అధికారుల్లో ఎక్కడ పురోగతి కనిపించ డం లేదన్నారు.

చెత్త సేకరణ సక్రమంగా చేయకపోవడం అధికారుల పని తీరుకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలంద రికీ తడి, పొడి చెత్త పూర్తిస్థాయిలో వేరు చేసి ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామంలో ఇంటింటకీ తిరిగి సేకరించిన ఫిర్యాదులను, పారిశుధ్య ఫొటోలను ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తామని తెలిపారు.





## గొల్లపేట రోడ్డుకు పూర్తయిన బెర్మలు

**-వాహనదారులకు ఉపశమనం**



**సారవకోట, డిసెంబరు11(వార్త):** సారవకోట మండలం జమచక్రం-సత్రం పంచాయతీ పరిధిలోని గొల్లపేట రోడ్డుకు ఎట్టకేలకు ఇరువైపులా బెర్మలు ఏర్పాటు కావడంతో స్థానికులలో ఊరట వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తర్వాత పల్లె పండుగ నిధులతో సుమారు ఆరు నెలల క్రితం ఈ రోడ్డును నిర్మించారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో రోడ్డుకుపక్కనున్న మట్టి బెర్మలు కొట్టుకుపోవడంతో రహదారి అంచులు దెబ్బతిన్నాయి. వాహనదారులు పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత శాఖలు ప్రాంతాన్ని పరిశీలించాయి. అనంతరం శాశ్వత పరిష్కారంగా రోడ్డుకు ఇరుప్రక్కలా సిమెంట్ బెర్మలను ఏర్పాటు చేశారు. దీంతో రహదారి మరింత బలమైనదిగా మారడమే కాకుండా వాహనదారుల రాకపోకలు సైతం సురక్షితంగా మారాయి. స్థానికులు అధికారులు తీసుకున్న ఈ చర్యను అభినందిస్తూ, రహదారి నిర్వహణలో ఇలాంటి విలువైన పనులు నిరంతరం కొనసాగించాలని కోరుతున్నారు.

## శివనగర్‌లో మురుగునీటి సమస్య తీవ్రం

**-అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**



**నరసన్నపేట, డిసెంబరు11(వార్త):** నరసన్నపేటలోని శివనగర్ కాలనీలో మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థలో వచ్చిన లోపాలు, మరమ్మతుల పనులు చెల్లాచెదురుగా సాగడంతో ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందని స్థానికులు తెలిపారు. ప్రాంతంలో పాటు పడుతున్న ఈ మురుగు సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ ఈ ప్రాంతం గుండా ప్రయాణం చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన, దోమల సమస్య, కాలుష్య భయం పెరగడంతో స్థానికుల జీవనోపాధికి ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. శివనగర్ ప్రజలు వెంటనే చర్యలు తీసుకుని డ్రెయినేజీ మరమ్మతులు పూర్తిచేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాల్సిందిగా అధికారులను కోరుతున్నారు.

## శ్రీముఖలింగేశ్వరుడి హుండీ ఆదాయం రూ. 8,10లక్షలు



**జలుమూరు, డిసెంబరు11(వార్త):** దక్షిణ కాశీ శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో నెలకొల్పిన ధర్మం హుండీలను డిసెంబర్ 11న లక్ష్మీవారపు రోజు అధికారికంగా తెరచి లెక్కించారు. మొత్తం 74 రోజుల వ్యవధికి హుండీల ద్వారా రూ. 8,10,214 ఆదాయం లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు, ఈ లెక్కింపును పర్యవేక్షణాధికారి గా ం మందస కార్యనిర్వాహణాధికారి ఎస్. నాగేశ్వరరావు పర్యవేక్షించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఏడుకొండలు, అర్చక సంఘం అధ్యక్షులు ఎస్వి చలం, సచివాలయ సెక్రటరీ గోవిందరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమం శాంతియుతంగా, పారదర్శకంగా పూర్తైనట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

# సీతారాం పోరాటం ఆదర్శనీయం

**ఏపీఆర్సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల**



**మందస, డిసెంబరు 11(వార్త):** ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం శ్రీకాకుళం జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ నర్తు సీతారా%శీ% అకాల మరణానికి చింతిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రం జగ్గంపేట శివారు రంగవల్లి నగర్ లో కామ్రేడ్ సీతారాం చిత్రపటానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ తేది.10.12.2025న శ్రీకాకుళం జిల్లా రైతు కూలీ సంఘం నాయకుడు కామ్రేడ్ సీతారా%శీ% అనారోగ్యంతో అమరుడయ్యారన్నారు. సీతారా%శీ% ఆంధ్ర ప్రదేశ్ రైతు కూలీ సంఘం శ్రీకాకుళం జిల్లా నాయకత్వంలో జిల్లా కమిటీ సభ్యుడుగా అనేక పోరాటాలు, ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. శ్రీకాకుళం జిల్లా ఉద్యమంలో అంచలంచెలుగా ఎదిగాడని, సీతారా%శీ% అమరుడు కావడం శ్రీకాకుళం జిల్లా ఉద్యమానికి రైతు కూలీ సంఘం ఉద్యమానికి తీరని లోటన్నారు. సీతారా%శీ% తన నమ్మిన సిద్ధాంతం కోసం నిరంతరం పోరాడుతూ రైతుకూలీ సంఘానికి జిల్లాలో బలపడటానికి ఎంతో కృషి చేశాడన్నారు. చనిపోయేంత వరకు ఎర్ర జెండాను విడిచిపెట్టలేదని కొనియాడారు. కామ్రేడ్ సీతారాం జీవితం ఆదర్శనీయమన్నారు. సీతారా%శీ% కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో రంగవల్లి నగర్ నాయకులు శ్రీను, సత్తిబాబు, తాతబాబు, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ..

# నరసన్నపేట విద్యార్థుల ప్రతిభ



**నరసన్నపేట, డిసెంబరు11(వార్త):** నరసన్నపేట పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తమ ప్రతిభను మరోసారి నిరూపించారు. ఈ నెల 8, 9 తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా తరపున పాల్గొన్న పుష్ప, మోక్షప్రభ, సంగీత, సిల్వర్ గొప్ప ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయికి ప్రవేశించిన ఈ విద్యార్థుల విజయంతో నరసన్నపేట ప్రాంతంలో ఆనందం వ్యక్తమవుతోంది. బృందంలోని ప్రతీ విద్యార్థి క్రీడాస్ఫూర్తి, శ్రమ, నైపుణ్యం ప్రదర్శించడంపై పాఠశాల ఉపాధ్యాయ వర్గం అభినందనలు తెలిపింది. విజయంతో పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చిన విద్యార్థులను బుధవారం పాఠశాల హెచ్ఎం వెంకట్రావు, వైఎంసీఏ సెక్రటరీ గొద్దు చిట్టిబాబు, పీడీలు ఎంవీ రమణ, గణపతి, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించాలని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా మామిడి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు



**ఎల్ఎన్ పేట, డిసెంబరు11(వార్త):** రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు ఎల్ఎన్ పేట మండ లంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎల్ఎన్ పేట జంక్షన్, వైయస్సార్ విగ్రహం వద్ద మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి శ్రీకాంత్ పుట్టిన రోజు శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టి పలువురుకు స్వీట్స్ పంచి పెట్టారు. కార్యక్ర మంలో జడ్పీటీసీ కిలారి త్రినాథులు, సీనియర్ వైకాపా నాయకులు కిలారి వెంకటరమణ, శివ్వాల షణ్ముఖరావు,ే గదెల విశ్వేశ్వరరావు, కాగితాపల్లి అర్జునరావు, శ్రీను పండా, కె.మోహనరావు, దుర్గారావు, కోటిపల్లి జగన్నాథం, నర్సింహులు, గోవిందరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, డిసెంబరు 11(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 9వ.వార్డు ముడియా వీధిలో నిరు పేద కుటుంబం జె.సరస్వతి కి ఇద్దరు అబ్బాయిలు. అందులో ఒకరికి పుట్టుకతో మూర్ఛ వ్యాధి తో బాధ పడుతున్నారు. ఆ కుటుంబం వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేనందు వలన పరిస్థితి అధ్వానంగా ఉంది. ఆమె విషయం తెలుసుకున్న జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ ఆ కుటుంబానికి పరామర్శించి,నిత్యా వసర సరుకులు అందించి వైద్యానికి కావలసిన సరిపడిన డబ్బులు ఆర్థిక సహాయం చేశారు.ఈ కార్యక్రమంలో,నరసింహ రెడ్డి, గౌతమ్ రెడ్డి,మరియు మండల అధ్యక్షురాలు దుర్గాసి నీలావేణి రెడ్డి, కాకినాడ సంతోష్,బాలు, తదితరులు పాల్గొన్నారు.

## వంశధార కాలువపై రక్షణ గోడ ఏదీ?

**-ప్రజల భయాందోళన**



**జలుమూరు, డిసెంబరు11(వార్త):** బసివాడ వద్ద వంశధార కాలువపై ఉన్న రహదారి ప్రస్తుతం ప్రమాదాల బాట పట్టిందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు ఆనుకుని ఉన్న రహదారిపై రక్షణ గోడ లేకపోవడం వల్ల రాత్రివేళల్లో కొత్తగా వచ్చే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని నివాసితులు వెల్లడించారు. కొన్నేళ్లుగా ఈ రహదారిపై రక్షణ గోడ నిర్మాణం గురించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. పైగా కాలువకు ఆనుకుని పెద్ద చెరువు ఉండటం ప్రమాద అవకాశాలను మరింత ఎక్కువ చేస్తున్నది. చిన్న తప్పిదం కూడా ప్రాణాపాయంగా మారే పరిస్థితి నెలకొన్నదని స్థానికులు చెబుతున్నారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని తక్షణమే రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని సంబంధిత శాఖలు వెంటనే చర్యలు తీసుకోవడం అత్యవసరమై ఉంది.

## అడవుల సంరక్షణకు ముమ్మర తనిఖీలు



**పోలాకి, డిసెంబరు11(వార్త):** పోలాకి మండలం డీఎల్పురం అటవీ రేంజ్ పరిధిలోని జోగంపేట అడవి ప్రాంతాలను జిల్లా అటవీ భూముల పర్యవేక్షణ అధికారి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. జిల్లాలోని మూడు డివిజన్లలో ప్రతి మూడు నెలలకు ఒకసారి పర్యవేక్షణ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు చెప్పారు. అడవుల అసలు విస్తీర్ణాన్ని గుర్తించేందుకు మ్యాపింగ్ సాంకేతికతను ఉపయోగిస్తున్నామని, భూముల పరిరక్షణలో జాప్యం లేకుండా పని చేయాలని సిబ్బందికి ఆదేశించారు. బీట్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసరావు, రంజిత్‌తో పాటు ఇతర అటవీ సిబ్బంది ఈ పరిశీలనలో పాల్గొన్నారు. అడవులను రక్షించడంలో ప్రజా సహకారం కూడా కీలకమని అధికారులు పేర్కొన్నారు.

## భక్తులకు అన్నదానం



**జి.సిగడాం, డిసెంబరు 11(వార్త):** ఆనందపురం పంచాయతీ అబోతులపేట గ్రామంలో భవానీ దీక్ష భక్తులు మజ్జి రామినాయుడు ఆద్యర్యంలో 1000 మంది భక్తులకు అన్న సమారాధ వితరణ నిర్వహించారు.వారు మాట్లాడుతూ అన్ని దానాలకంటే అన్నదానం మహా దానమన్నారు. పాడిపంటలు బాగా పండి రైతులు ఆనందంగా ఉండాలని రైతులకు మంచి దిగుబడులు వచ్చి ఇంటికి మంచి ఫలసాయం రావాలని భవానీమాతను వేడుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జ పర్తి రఘురాం, కూటమి నాయకులు పొగిరి నారాయణరావు, గురుభవాని రెడ్డి శ్రీనువాసరావు, చిత్తిరి గరికినాయుడు, గ్రామ పెద్ద అబోతుల విశ్వేశరరావు, లొలుగురాము, అబోతుల లక్ష్మీ నారాయణ, మొయ్యి రాము, అబోతల అప్పన్న, కిల్లారి రాజు, చిత్తిరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 11(వార్త):** శ్రీకాకుళం జిల్లాలో రైతులం దరికీ రబీ 2025-26కి సంబంధించిన పంటలు మొక్కజొన్న, వరి ఇతర పంట లకి సంబంధించిన యూరియా అవసరం మేరకు జిల్లాకి కేటాయించడ జరిగిం దని జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథ స్వామి తెలిపారు. పంట విస్తీర్ణాన్ని బట్టి మండలాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలు, పి.ఎ.సి.ఎస్, డి.సి.ఎం.ఎస్, ప్రైవేటు డీలర్లు ద్వారా రైతులకు సజావుగా సరఫరా నిమిత్తం యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రిటైల్‌లో 2750 మెట్రిక్ టన్నుల నిల్వ ఉన్నట్లు రైతులు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాలను పీఏసీఎస్, డీసీఎం ఎస్, ప్రైవేటు దుకాణాలకు సంప్రదించి యూరియాను పొందవచ్చునని తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## వృద్ధాశ్రమం వద్ద మామిడి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

**హిరమండలం, డిసెంబర్ 11(వార్త):** మాజీ రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు మామిడి శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలను హిర మండలం ప్రేమ సాయి వృద్ధా శ్రమములో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు.

ఈసందర్భంగా ఆశ్రమవాసుల కు పండ్లు పంపిణీ చేసి ఆశ్రమవాసులకు మధ్యాహ్నం భోజనాలు ను ఏర్పాటు చేసామన్నారు.

ఈ కార్యక్రమం లో వైకాపా సీనియర్ నాయకులు పొదిలాపు శ్రీరాములు, గొర్లె మోహన రావు, వంగపల్ల ఎర్రం నాయుడు, లుక లాపు రమణ, జెన్ని శ్రీను, వాకాడఆనంద్ రావు, జెన్నీ వెంకట్ రావు, వాకాడ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలే విద్యార్థి భవిష్యత్‌కు బలం

### మబగాం జడ్పీ హై స్కూల్‌లో
### నియోజకవర్గ స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

**పోలాకి, డిసెంబరు11(వార్త):** పోలాకి మండలం, మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలాకి మండలంలోని మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ %ు% గ్రిగ్ మీట్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు ఎంత ముఖ్యమో వివరించారు. "విద్యతో పాటు క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్యం, సాహసం, నాయకత్వ గుణాలు పెంచుతాయి. మన నరసన్నపేట





నియోజకవర్గం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి వెళ్లే క్రీడాకారులు మరింత సంఖ్యలో రావాలి" అని ఎమ్మెల్యే అన్నారు. అలాగే, క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహం, మౌలిక వసతులు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం, వివిధ ఆటల్లో పాల్గొంటున్న విద్యార్థులకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, నరసన్నపేట %ు% పోలాకి వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్లు శిమ్మ చంద్రశేఖర్, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఏసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, పట్టణ %ుఞూ% అధ్యక్షులు కింజరాపు రామారావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు రావాడ గణపతిరావు, కాయ రవి, దుంగ సీతారాం, మెండ వేణు, వనమాలి జగదీష్ బాబు, అలాగే మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థల పరిశీలన



**సంతబొమ్మాళి, డిసెంబరు11(వార్త):** కొల్లిపాడు పంచాయతీ సుగ్గువానిపేట గ్రామంలో ఇళ్ల పట్టాలు మంజూరు కోసం ప్రభుత్వ స్థలాన్ని తాసిల్దార్ హేమ సుందర్ రావు గురువారం పరిశీలించారు. ఈ పంచాయతీ నుండి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని దరఖాస్తులు రావడంతో తాసిల్దార్ స్పందించారు. స్థలాన్ని పరిశీలించి సర్వేనెంబర్, ఎంత విస్తీర్ణం, ఏ పరిధిలో ఉందో వివరాలను తెలుసుకున్నారు. దీంతోపాటు ఆర్ఐ చంద్రమౌళి ఉన్నారు.

## ఘనంగా భారతీయ భాషల దినోత్సవం



**ఎల్ఎన్ పేట, డిసెంబరు11(వార్త):** లక్ష్మీనర్సుపేట మోడల్ ప్రాథమిక పాఠశాలలో భారతీయ భాషల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు పద్యాలు, వ్యాస రచన, పద్యాలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉత్తమ ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్పర్సన్ ఎంకే మిశ్రో, పాఠశాల ఉపాధ్యాయులు, నక్క రామా రావు, టి.ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్‌లో ఘనంగా ముగిసిన గ్రిగ్స్



**కొత్తూరు, డిసెంబరు11(వార్త):** కొత్తూరు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 76వ గ్రిగ్స్ క్రీడా పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ క్రీడల్లో ఉత్సాహంగా పోటీపడ్డారు.కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ క్రీడల్లో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో వంటి విభాగాల్లో గట్టి పోటీలు నెలకొన్నాయి. కొరసవాడ, చాపర, అవలింగి వంటి పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు.విజేతలకు బహుమతులు ప్రదానం చేయడానికి ప్రధానోపాధ్యాయులు లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు ని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలను అందజేసి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సమానంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ లక్ష్మీ నారాయణ నాయుడు, పడాల వెంకట కృష్ణ, కనపాకల నారాయణ మాస్టర్ పాల్గొన్నారు.

## 18న పెన్షన్ అదాలత్

**శ్రీకాకుళం, డిసెంబర్ 11 (వార్త):** జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 18న 'పెన్షన్ అదాలత్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్. శాంతి ప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం, పదవీ విరమణకు ముందే పింఛను ప్రయోజనాలను మంజూరు చేసే ప్రక్రియపై డీడీఓలు, పీఎస్ఏలకు పూర్తి అవగాహన కల్పించడమే ఈ అదాలత్ ప్రధాన లక్ష్యమని ఆమె వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా పింఛనుదారులు, అధి కారుల మధ్య దూరం తగ్గి, సమస్యల పరిష్కారానికి ఒక వేదిక లభిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి వంటి జిల్లాల్లో ఈ కార్యక్రమం అత్యంత విజయవంతమైందని ఆమె గుర్తుచేశారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు అదాలత్ జరగనుందని పెన్షన్లు, జీపీఎఫ్, అకౌంట్స్ విభాగాల సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, పింఛను ప్రపోజల్స్ సరైన సమర్పణపై మార్గనిర్దేశం చేస్తారని, సకాలంలో సరైన పత్రాలతో దరఖాస్తులు సమర్పించడం ద్వారా ఉద్యోగులు పదవీ విరమణ రోజునే పింఛను ప్రయోజనాలు పొందేలా కృషి చేయాలని ఆమె జిల్లా అధికా రులను కోరారు. శ్రీకాకుళం జిల్లాలోని ప్రభుత్వ శాఖల అధికారులు, పింఛను దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

## వీఈఆర్ ప్రాజెక్టులు వేగవంతం చేయాలి

**శ్రీకాకుళం, డిసెంబర్11(వార్త):** విశాఖ ఎకనామిక్ రీజియన్ (వీఇఆర్)లో భాగంగా జిల్లాకు ప్రతిపాదించబడిన 12 భారీ ప్రాజెక్టులకు సంబంధించి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ సమీక్ష నిర్వహించారు. వీఈఆర్ పరిధిలో తొమ్మిది జిల్లాలు ఉన్నాయి. గురువారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో



శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదిత ఏయే ప్రాజెక్టులకు ఏ దశలో ఉన్నది, వాటికి సంబంధించి భూసేకరణ, మౌలిక వసతులు, సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక, అభిప్రాయ వ్యక్తీకరణ తదితర విషయాలను ఏ దశలలో ఉన్నది ప్రాజెక్టుల వారీగా అడిగి తెలుసుకున్నారు. వీటిని త్వరితగతిని ముందుకు తీసుకెళ్లుటకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశారు. ఏ ప్రాజెక్టులు ఎంత ప్రతిపాదిత పెట్టుబడితో వచ్చుటకు అంగీకారం తెలుపుతున్నారు, వాటి వలన చేకూరే ఉపాధి కల్పన అవకాశాలు వాటిని పరిశీలించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, టెక్కలి శ్రీకాకుళం ఆర్డీవోలు కృష్ణమూర్తి నాయుడు సాయి ప్రత్యూష, ముఖ్య ప్రణాళిక అధికారి లక్ష్మీ ప్రసన్న, పరిశ్రమలు, రహదారులు భవనములు, అగ్రికల్చర్, హార్టికల్చర్ పశుసంవర్ధక శాఖ, పొల్యూషన్ కంట్రోల్, బోర్డ్ గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నవోదయ మోడల్ పరీక్షకు విశేష స్పందన



**జలుమూరు, డిసెంబరు11(వార్త):** జలుమూరులోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్షల కోసం నిర్వహించిన మోడల్ పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవరావు గురువారం ఉదయం ప్రారంభించారు. ఐదో తరగతి విద్యార్థులను లక్ష్యంగా పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశం కోసం కఠినమైన పరీక్షలు నిర్వహిస్తారని, ఆ నమూనాలోనే విద్యార్థులకు అభ్యాసం కల్పించాలనే ఉద్దేశంతో ఈ మోడల్ పరీక్షలను చేపట్టామని పేర్కొన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి ఈ తరహా గ్రాండ్ టెస్టులు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. మోడల్ ప్రైమరీ స్కూల్ జలుమూరు ఆధ్వర్యంలో జరిగిన ఈ నవోదయ గ్రాండ్ టెస్ట్‌లో జలుమూరు, సారవకోట, కోటబొమ్మాళి మండలాల నుండి విద్యార్థులు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పరీక్షలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులు వరుసగా..

**ప్రథమ స్థానం:** మెండ. లోచన్ (మోడల్ ప్రాథమిక పాఠశాల, జలుమూరు)

**ద్వితీయ స్థానం:** ఎన్.లవకుమార్ (మోడల్ ప్రాథమిక పాఠశాల, రావిపాడు)

**తృతీయ స్థానం:** పి.ప్రియాంక, బి.వైష్ణవి (మోడల్ ప్రాథమిక పాఠశాల, జలుమూరు), పి. నిశాంత్ (ఎంపీపీఎస్, దరివాడ) విద్యార్థులకు మొమెంటో అందజేసారు. ఈ గ్రాండ్ టెస్ట్‌లో విద్యార్థులను పంపిన తల్లిదండ్రులు, వారిని సిద్ధం చేసిన పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన మండల విద్యాశాఖ అధికారులకు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వీఆర్ఏలకు పే స్కేల్, ప్రమోషన్లు వెంటనే అమలు చేయాలి

**కొత్తూరు, డిసెంబరు11(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల నాయకులు దోర్నాన అనిల్, గణపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలకు వెంటనే పే స్కేల్ జీతాలు అమలు చేయాలని, అర్హులైన వారికి వీఆర్ఓ, అటెండర్ తదితర ప్రమోషన్లు అందజేయాలని వారు డిమాండ్ చేశారు.నేడు వీఆర్ఏల సంఘం నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) ఎస్.వి. లక్ష్మణ మూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు, తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగానే మన రాష్ట్రంలో కూడా వీఆర్ఏలకు పే స్కేల్ జీతాలు చెల్లించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వీఆర్ఏలతో నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు చేయించడం అన్యాయం అని తెలిపారు.వారు పేర్కొన్నదేమిటంటే, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ కాలంలో జీతాల పెంపు కోసం ధర్నా చేసినప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాగానే వీఆర్ఏల జీతాన్ని రూ.15,000కి పెంచుతామని" ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు."ముఖ్యమంత్రికి ఒకసారి, రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి ఆరు దఫాలు, సీసీఎల్ఏకి మూడుసార్లు వినతిపత్రాలు ఇచ్చినా, గత ఎనిమిది నెలలుగా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని వారు విమర్శించారు.ప్రస్తుతం వీఆర్ఏలు కేవలం రూ.10,500 జీతంతో కుటుంబ పోషణ కష్టమై పోయిందని, నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, పిల్లల విద్యా ఖర్చులు భారీగా పెరిగిపోయాయని తెలిపారు. కావున ప్రభుత్వానికి విన్నపం చేస్తూ, పే స్కేల్ జీతాలు వెంటనే చెల్లించి వీఆర్ఏ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

అదే సందర్భంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న వీఆర్ఓ, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ తదితర పోస్టులను అర్హులైన వీఆర్ఏలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఖాళీలలో కనీసం 70 శాతం వీఆర్ఏలకే కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.వీఆర్ఏలు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం స్పష్టం చేసింది.






## భాషా ఉపాధ్యాయులు, అధ్యాపకులకు వర్క్ షాప్

**శ్రీకాకుళం, డిసెంబర్ 11 (వార్త):** పెద్దపాడులోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల జిల్లా సమన్వయ అధికారి వై.యశోద లక్ష్మి అధ్యక్షతన పదవ తరగతి, ఇంటర్మీడియట్ బోధించే భాషా ఉపాధ్యాయులు, అధ్యాపకులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధనలో సృజనాత్మ కతను ఇనుమడింప చేసి ఆస్వాదిస్తూ బోధిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు నన్నారు. ఈ వర్కుషాప్‌లో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా పాల్గొని శతశాతం ఉత్తీర్ణత సాధిస్తూ విద్యార్థులందరికి 95శ్యాతం పైబడి మార్కులు వచ్చే విధంగా మంచి మెటీరియల్ని తయారుచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలియజేశారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ ఐ.సంతోష్ కుమార్ హిందీ ఉపాధ్యాయులకు మార్గని ర్దేశం చేశారు. సబ్జెక్టు ఉపాధ్యాయులందరూ సబ్జెక్టు వారీగా చర్చించుకొని మంచి మెటీరియల్ని రూపొందించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ సైకాలజీ ప్రొఫెసర్ కె.తారకరామారావు ఉపాధ్యాయ అధ్యాపక సిబ్బందికి స్ట్రెస్ మేనేజ్మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎస్.పద్మజ, ఎన్.రామకృష్ణ, బుచ్చిరాజు, పేడాడ శ్రీనివాస్, భాషా అధ్యాపకులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## హిందూ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



**శ్రీకాకుళం, డిసెంబర్ 11 (వార్త):** రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే హిందూ సమ్మేళనం కార్యక్రమానికి సంబం ధించిన పోస్టర్‌ను కుశాలపురంలో ఆవిష్కరించారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు గురువారం కుశాలపురంలో పోస్టర్లను పంపిణీ చేశారు.

## బీమా పాలసీలపై అవగాహన

**నరసన్నపేట, డిసెంబర్ 11(వార్త):** సమాజంలో జీవితబీమా అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని ఎల్ఐసీ నరసన్నపేట సీనియర్ బ్రాంచి మేనేజర్ ఎం.నేతాజీ అన్నారు. జీవితానికి రక్షణ కల్పించడం కోసం ఎల్.ఐ.సీ. ప్రజలకు ఎంతో సహాయం చేస్తోందనీ తెలిపారు. ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట ఒకేషనల్ విద్యార్థులకు నేతాజీ ప్రత్యేక అవగాహన కల్పించారు. జీవితానికి రక్షణ సామాజిక భద్రతే ధ్యేయంగా సంస్థ పనిచేస్తోందనీ, తాము చేపడుతోన్న కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల సూచనలతో ఒకేషనల్ విద్యార్థులకు ఎల్ఐసీలో రెండో రోజు ఓజేటీ కార్యక్రమం నిర్వహించామనీ ఏఅండ్‌టీ అధ్యాపకులు, ఓజేటీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గివలస రాంప్రసాద్, అధ్యాపకులు కొర్రాయి రవి పేర్కొన్నారు. డీవీఈఓ సురేష్ కుమార్ ఆదేశాల మేరకు ప్రాంతీయ కమిటీ ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల, జలుమూరు కళాశాల నిరంజన్ క్షేత్రస్థాయి శిక్షణను పర్యవేక్షించారు. జీవితబీమా పాలసీలు, సరెండర్ విలువ లెక్కించడం, బీమా క్లైములు విభాగం పనితీరు, అకౌంట్స్ విభాగం, సామాజిక బాధ్యత కింద సంస్థ అందిస్తున్న సబ్సిడీలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు రాంప్రసాద్, రవి బ్రాంచి మేనేజర్ నేతాజీకి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546